క్లుప్తంగా

రైతులకు అందుబాటులో ఉండండి

అవుకు: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని, ఆర్బీకేల గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులకు అందుబాటులో ఉండాలని ఏఓ అబ్దుల్ హక్ సూచించారు. మండల పరిధిలోని రామాపురం–1, 2, సంగపట్నంలోని రైతుభరోసా కేంద్రాలను గురువారం ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. ప్రతి ఆర్బీకే పరిధిలోనూ 25వరకు మట్టి నమూనాలను సేకరించి ల్యాబ్‌లకు తరలించాలని సూచించారు. అలాగే పీఎం కిసాన్ పథకానికి అర్హులైన రైతుల ఈకేవైసీని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించా రు.కార్యక్రమంలో వీఏఏలు భాగ్యవతి, నరసింహ, రామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేల బెలుం ఆలయాభివృద్ధికి రూ.లక్ష విరాళం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని బందార్లపల్లె సమీపంలోని పురాతన నేల బెలుం మల్లేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి బందార్లపల్లెకు చెందిన భక్తుడు యాతం పెద్ద రామిరెడ్డి లక్ష రూపాయలు విరాళాన్ని గురువారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కమిటీ సభ్యు లు దాతల సహకారంతో భక్తుల సౌకర్యార్థం ఇప్పటికే పలు వసతులు కల్పించారు. ఈసందర్భంగా దాత పెద్దరామిరెడ్డిని సన్మానించారు.

నేడు గడపగడప మన ప్రభుత్వం

సంజామల: మండల పరిధిలోని నొస్సం గ్రామంలో శుక్రవారం ఉదయం గడపగడప కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్‌రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ మలికిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరై నాలుగేళ్లలో ప్రభుత్వ అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తారని, అదేవిధంగా సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తారని చెప్పారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బ్రహ్మానంద ఆచారికి గౌతమ్ బుద్ధ పురస్కారం

బనగానపల్లెరూరల్: మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జేఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారికి మనం పౌండేషన్ సంస్థ గౌతమ్‌బుద్ధ ఇంటర్నేషనల్ పురస్కారం అందజేసింది. బుధవారం మన పౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బిల్లా పౌండేషన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ అవార్డును అందుకున్నారు.

ఏఓగా జ్యోతి

కొలిమిగుండ్ల: మండల వ్యవసాయాధికారిణిగా జ్యోతి గురువారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా రుద్రవరంలో విధులు నిర్వర్తిస్తున్న జ్యోతి ఇక్కడికి వచ్చారు. ఏటకు ఏఈఓ నాగరాజు, గ్రామ వ్యవసాయ సహాయకులు, ఎంపీఓలు, ఉద్యాన సహాయకులు అభినందనలు తెలిపారు.

26న ప్రవేశ పరీక్ష

బనగానపల్లెరూరల్: రవ్వలకొండ పై ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో మిగిలిపోయిన 7,8,9వ తరగతిల్లో ప్రవేశానికి ఈ నెల 26న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రామలక్ష్మీ తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ పేర్లను ఏపీ మోడల్ స్కూల్‌లో ఈ నెల 26న ఉదయం 9 గంటలలోపు నమోదు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష ఉదయం 10గంటలకు ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఇరు వర్గాల ఘర్షణ

కోవెలకుంట్ల: మండలంలోని కలుగొట్లలో గురువారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. తాగునీటి సరఫరాకు సంబంధించి పైప్‌లైన్ ఏర్పాటు విషయంలో టీడీపీ, వైఎస్సార్ వర్గీయుల మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులకు సమాచారం అందటంతో సీఐ నారాయణరెడ్డి, కోవెలకుంట్ల, రేవనూరు, సంజామల ఎస్ఐలు వెంకటరెడ్డి, కల్పన, ప్రతాప్ సిబ్బందితో గ్రామానికి చేరుకున్నారు. పోలీసులు ఇరువర్గాలను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు.

బయోమెట్రిక్ పూర్తి చేయాలి

కొలిమిగుండ్ల: జగనన్న విద్యాకానుక అందజేసిన విద్యార్థులతో తప్పక బయోమెట్రిక్ వేయించాలని, ఈప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని ఎంఈఓ–2 రెడ్డి అబ్దుల్ కలాం సూచించారు. గురువారం పెట్నికోట, గొర్విమానుపల్లె, అంకిరెడ్డిపల్లె, తిమ్మనాయినపేట తదితర ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న బయోమెట్రిక్‌ను పరిశీలించారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

సంజామల: ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష పథకాన్ని అమలు చేస్తుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి గుండం సూర్య ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలం కేంద్రం సంజమాల సచివాలయంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో గుండం సూర్య ప్రకాష్‌రెడ్డి మాట్లాడారు. ప్రతి వాలంటరీ బాధ్యతతో పని చేయాలని అర్హులై పథకాలు అందనివారిని గుర్తించాలని సూచించారు.

పింఛన్ గౌరవం పెంచెన్!

- 1వ తేదీన ఠంఛన్‌గా పింఛన్ అందుతున్న వైనం
- తెల్లారకముందే తలుపుతట్టి నగదు అందజేస్తున్న వలంటీర్లు
- అన్నివర్గాల నుంచి వెల్లువెత్తుతున్న హర్షాతిరేకాలు

బనగానపల్లె: ప్రజల వద్దకే పాలన లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుకు సాగుతోంది. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చి కుగ్రామాల్లో సైతం ప్రజలకు నేరుగా అన్ని సేవలందిస్తుంది. ప్రత్యేకించి సామాజిక పింఛన్ పంపిణీ తీరుపై అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతినెలా ఒకటవ తేదీన ఠంఛన్‌గా పింఛన్ అందుతున్న తీరును ప్రతిఒక్కరూ అభినందిస్తున్నారు. తెల్లారకముందే తలుపుతట్టి వలంటీర్లు పింఛన్ సొమ్ము అందజేస్తుండడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అవ్వతాతలుతో పాటు విధి వక్రీకరించిన వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళ తదితరులు వలంటీర్ల సేవలను కొనియాడుతున్నారు. తామూ గౌరవమైన జీవితం గడిపేలా పింఛన్ సొమ్ము భరోసానిస్తుందంటూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 12 రకాల పింఛన్‌ను అమలు చేస్తుంది. వృద్ధాప్య, చేనేత, వితంతు, వికలాంగుల, టాడీటాపర్స్ పింఛన్, ఏఆర్‌టీ, ట్రాన్స్ జండర్, మత్స్యకార, ఒంటరి మహిళ, సీకేడీయు, సంప్రదాయ కోబ్లర్స్, డప్పు కళాకారులకు పింఛన్ అందజేస్తుంది. బనగాపల్లె నియోజకవర్గంలో 37,084 మంది పింఛన్‌దారులు ఉండగా ప్రతినెలా ఒకటవ తేదీన రూ.10.28కోట్లు పంపిణీ చేస్తున్నారు వలంటీర్లు.

గత ప్రభుత్వానికి భిన్నంగా అర్హులందరికీ పింఛన్...

అర్హతే ప్రామాణికంగా కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తుంది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం . గత ప్రభుత్వానికి భిన్నంగా అర్హులందరికీ పింఛన్ అందజేస్తుండడంతో అవ్వతాతలు, అక్కచెల్లెమ్మలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో గ్రామానికి ఇన్నే పింఛన్‌లు అనే నానుడు. పింఛన్ మంజూరు కావాలంటే ఇంకో లబ్ధిదారుడి మృతి కోసం ఎదురు చూసే దౌర్భాగ్యం. అంతేకాకుండా టీడీపీ... జన్మభూమి కమిటీ ఆశీర్వాదం తప్పనిసరి దుస్థితి. దీంతో అర్హులైన వృద్ధులు, దివ్యాంగులు నిస్పృహకు గురయ్యే పరిస్థితి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వాటన్నింటికీ స్వస్తి చెప్పింది. అర్హత ఉంటే చాలా మీ ఇంటి దగ్గరకు పింఛన్ వస్తుందనే భరోసా కల్పించింది. వలంటీర్ సాయంతో అర్హులందరూ లబ్ధి పొందుతున్నారు కూడా. ప్రతియేటా రెండుసార్లు(జూన్, డిసెంబర్) లబ్ధిదారుల ఎంపిక చేపడుతున్నారు అధికారులు. అనర్హత మూలంగా పింఛన్ మంజూరు కాకపోవడానికి కారణాలు సైతం దరఖాస్తు దారులకు వివరిస్తున్నారు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్, వలంటీర్.

మండలాలవారీగా పింఛన్ వివరాలు

మండలం	పింఛన్‌దారులు	మొత్తం (రూ.కోట్లు)
బనగానపలె	12,357	3.44
అవుకు	6,662	1.84
కోవెలకుంట్ల	5,898	1.63
సంజామల	5,182	1.42
కొలిమిగుండ్ల	6,985	1.95

పడిగాపుల నుంచి విముక్తి....

గత టీడీపీ ప్రభుత్వంలో అందజేసే అరొకర పింఛన్ పొందేందుకు లబ్ధిదారులకు పడిగాపులు పడాల్సిన దుస్థితి.పంచాయతీ కార్యాలయాల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరీక్షించిన సందర్భాలు కోకొల్లలు. పింఛన్ సొమ్ము తీసుకునేందుకు వచ్చి నిరీక్షించిన వృద్ధులు చాలా మంది సొమ్మసిల్లిన సందర్భాలు అనేకం. ఒక్కోసారి వారం, పదిరోజులు పట్టేది కూడా. పాదయాత్రలో గుర్తించిన ఈ సమస్యలన్నింటికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెక్ పెట్టారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చి నేరుగా లబ్ధిదారులకు ఠంఛన్‌గా పింఛన్ అందజేస్తున్నారు. దీంతో లబ్ధిదారులు సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



బయోమెట్రిక్ ద్వారా వైఎస్సార్ పింఛన్‌కానుక పంపిణీ చేస్తున్న వలంటీర్ (ఫైల్)

గతంలో ఇబ్బందులు వాస్తవం....



గతంలో పింఛన్ పంపిణీలో వాస్తవానికి ఇబ్బందులు ఉండేవి. పంచాయతీ కార్యదర్శి, వీఆర్‌ఓ పింఛన్లు పంపిణీ చేస్తున్న నేపథ్యంలో ఆలస్యం అయ్యేది. దాదాపు పదిరోజుల సమయం పట్టేది. అప్పుడప్పుడు వృద్ధుల అగచాట్లు చూసి మేము కూడా ఆందోళన చెందిన సందర్భాలు ఉన్నాయి. వలంటీర్ వ్యవస్థతో పింఛన్‌దారులకు ప్రతినెలా 1వ తేదీనే నగదు అందుతుంది. ఒక్కరోజులోనే దాదాపు 95శాతం మేర పంపిణీ జరుగుతుంది. అభాగ్యులకు 1వ తేదీనే నగదు అందజేత ఎంతో తృప్తినిస్తుంది. – శివరామయ్య ఎంపీడీఓ బనగానపల్లె

కుటుంబానికి ఆసరాగా పింఛన్



నేను కూలీ పని చేసుకుంటూ జీవినం సాగిస్తున్నా. దాదా పు ముప్పైఏళ్లుగా పింఛన్ అందుతుంది. ప్రారంభంలో రూ.200 అందేది. ఈ మొత్తం తీసుకునేందుకు నానా కష్టా లు పడాల్సిన పరిస్థితి. జగనన్న ప్రభుత్వంలో ప్రస్తుతం రూ.2,750 పింఛన్ వస్తుంది. జగనన్న పుణ్యమా అని ప్రతినెలా 1వ తేదీన వలంటీర్ నా ఇంటి తలుపు తట్టి పింఛన్ అందజేస్తున్నారు. సీఎం సాయం మారువం.
– డి శేషమ్మ, పింఛన్ లబ్ధిదారు, భానుముక్కల, బనగానపల్లె

వైఎస్ జగన్‌కు రుణపడి ఉన్నాం



మాది పేద కుటుంబం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీఎం వైఎస్ జగన్ పుణ్యంతో పక్షవాత పింఛన్ ప్రతి నెల రూ.5వేలు వస్తుంది. ప్రతినెలా వలంటీర్ 1వ తేదీన ఇంటి వద్దకు వచ్చి నగదు అందజేస్తున్నాడు. వైద్యఖర్చులతో పాటు ఇతర అవసరాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. గౌవరంగా జీవిస్తున్నాం. సీఎం వైఎస్ జగన్‌కు మా కుటుంబం రుణపడి ఉంటుంది. –షేక్ కరీంసాహెబ్, శివనందినగర్, బనగానపల్లె

సేవ సంతృప్తినిస్తుంది



వలంటీర్‌గా ప్రజలకు అందజేస్తున్న సేవ సంతృప్తినిస్తుంది. ప్రత్యేకించి ప్రతి నెలా 1వ తేదీ ఉదయమే అవ్వా తాతలకు పింఛన్ మొత్తం అందజేస్తున్నప్పుడు వారి సంతోషం మాటల్లో చెప్పలేం. వారి కళ్లలో కనిపించే తృప్తి ఎంతో ఆనందాన్నిస్తుంది. వారి తృప్తి మాకు దీవెనలుగా భావిస్తున్నాం. ఎవరైన అనారోగ్యంతో బయటి ప్రాంతాల్లోని ఆసుపత్రుల్లో ఉంటే అక్కడికే వెళ్లి పింఛన్ సొమ్ము అందజేస్తున్నా.
– కె.వెంకట మోహన్, వలంటీర్, బనగానపల్లె

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

- ఆర్డీఓ వెంకటరెడ్డి

అవుకు: అధికారులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, బాధ్యతగా ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఆర్డీఓ వెంకటరెడ్డి సూచించారు. గురువారం అవుకు రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించిన ఆర్డీఓ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడం మన బాధ్యత అన్నారు. ఏ ఒక్క అర్హుడు అసంతృప్తిగా ఉండకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని, వలంటీర్లు, గృహసారథులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు, ప్రజలకు కావాల్సిన పత్రాలకు సంబంధించిన సమస్యలు తెలుసుకోవాలన్నారు. ఏడురోజుల అనంతరం మండలస్థాయి అధికారులు ప్రతి సచివాలయంలో జగనన్న సురక్ష క్యాంప్ ఏర్పాటు చేసి, ప్రజల నుంచి సేకరించిన వివరాలను పరిశీలించి అక్కడికక్కడే పరిష్కారం చేసి ప్రజలకు అవసరమైన పత్రాలు జారీ చేయాలన్నారు. ముఖ్యంగా కుల, ఆదాయ, జనన, మరణ, వివాహ, కుటుంబ సభ్యుడి ధ్రువీకరణ పత్రాలు, మ్యుటేషన్ లావాదేవీలు, ఆధార్ సమస్యలు, పంట సాగు హక్కు కార్డు వంటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అదేవిధంగా జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమాల్లో ప్రజల నుంచి వచ్చే అర్జీలను ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించి, ప్రజలను సంతృప్తి పరచాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ బాబు, మండల సర్వేయర్ హరి కృష్ణ, ఆర్ఐ వెంగల్ రెడి పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

కోవెలకుంట్ల: స్థానిక సంతపేటకు చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్ఐ వెంకటరెడ్డి గురువారం తెలిపారు. కాలనీకి చెందిన కౌసల్య అనే యువతి ఉదయం స్నేహితురాలి వద్దకు అంటూ ఇంట్లో నుంచి వెళ్లింది. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కలా విచారించినా ఆచూకీ తెలియలేదు. యువతి తండ్రి నాగరాజు పోలీసులను ఆశ్రయించడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ప్రభుత్వ సాయం మరువం

- కమ్యూనిటీ హాలుకు రూ.3కోట్లు మంజూరుపై బలిజ సంఘం నాయకుల హర్షం

డోన్ టౌన్: బలిజ సంఘీయులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో మేలు చేస్తోందని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాయం మరువమని డోన్ బలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పటేల్ తెలిపారు. డోన్‌లో బలిజ సంఘీయుల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.3కోట్లు మంజూరు చేస్తూ గురువారం జీవో జారీ చేసింది. ఈమేరకు జాతీయ రహదారి సమీపంలో ఉన్న రాయల్ సర్కిల్ సంఘ కార్యాలయంలో గురువారం నాయకులు సమావేశమై సీఎంతోపాటు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం మంత్రి బుగ్గన గతంలో స్థలం కేటాయించడం, సీఎం దృష్టికి తీసుకెళ్లి రూ.3కోట్లు నిధులు మంజూరు చేయించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సచివాలయాల పట్టణ కన్వీనర్ కురుకుందు హరి, సంఘం నాయకులు కురుకుందు శేఖర్, వెంకటేశులు, సత్యం, కృష్ణ, చెన్నయ్య తదతరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పటేల్

అన్నివర్గాల అభివృద్ధికి మంత్రి సహకారం

డోన్: మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్ని సామాజిక వర్గాల అభివృద్ధికి సహకారం అందజేస్తున్నారని ఎంపిపి రేగటి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మంత్రి ప్రత్యేక చొరవతో డోన్‌లో కాపు, బలిజలకు నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.3కోట్లను మంజూరు చేయించారన్నారు. డోన్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు మంత్రి అంకితభావంతో కృషి చేస్తున్నారని, పట్టణంతోపాటు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు విరివిగా మంజూరు చేయిస్తున్నారని పేర్కొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ

అవుకు: మండల కేంద్రం అవుకులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని జిల్లా రిజిష్టర్ అధికారి చెన్నకేశవ రెడ్డి గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ రిజిష్టర్ కార్యాలయ పరిధిలోకి అవుకు, కొలిమిగుండ్ల, సంజామల మూడు మండలాల గ్రామాలు వస్తాయని, దస్తావేజులను చేయించుకోవటానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. అలాగే కార్యాలయానికి సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు నోటీస్ బోర్డుల్లో ఉంచాలన్నారు. శిథిలావస్థలో ఉన్న కార్యాలయాన్ని పరిశీలించిన ఆయన భవన పరిస్థితిని ఉన్నతాధికారులకు వివరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సబ్ రిజిష్టర్ హాజీమియా, క్లర్క్ కిరణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న చెన్నకేశవ రెడ్డి

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

అవుకు: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించొచ్చని, ఆ దిశగా రైతులు ముందుకు సాగాలని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు అధికారి నరేంద్ర రెడ్డి సూచించారు. మండల పరిధిలోని శింగనపల్లె గ్రామం ఆర్బీకేలో రైతులకు పకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వం మన పెద్దలు కేవలం పృకృతి వ్యవసాయ పద్ధతి ద్వారానే ఆహార ధాన్యాలను పండించారని, దీంతో ఎంతో ఆరోగ్యంగా ఉండేవారన్నారు. ప్రస్తుతం రసాయన ఎరువుల వాడకం అధికమైనందున పోషకాలు నశించాయని, ఆరోగ్యాలు అంతంతమాత్రంగా ఉన్నాయన్నారు. అదే విధంగా భూసారం కూడా తగ్గిపోయి పంటల దిగుబడులు రాక రైతులు నష్టాలపాలవుతున్నారని తెలిపారు. రైతులు రాబోయే తరాల గురించి ఆలోచించి ప్రకృతి వ్యవసాయాన్ని అవలంభించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ అబ్దుల్ హక్, వీఏఏ బాషా, రైతులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి

డోన్ టౌన్: విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని వెంకటనాయునిపల్లె సర్పంచ్ చంద్రశేఖర్‌నాయుడు, ప్రిన్స్‌పాల్ గీత తెలిపారు. పట్టణ సమీపంలోని బాలికల గురుకుల పాఠశాల్లో గురువారం విద్యార్థులకు వారు పుస్తకాలను పంపిణీ చేసి మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యాభివృద్ధికి వేల కోట్ల రుపాయలను ఖర్చు చేస్తోందన్నారు. జగనన్న విద్యా కిట్లు, అమ్మ ఒడి, విద్యా, వసతి దీవెనలు, పౌష్టికాహారం అందజేస్తుందని వివరించారు.



పుస్తకాలను అందజేస్తున్న దృశ్యం

26 నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

బేతంచెర్ల: ఏపీ ప్రభుత్వ ఓపెన్ స్కూల్ పదవ తరగతి, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 26 నుంచి జూలై 4వ తేదీ వరకు జరుగుతాయని భాగ్యోదయ హైస్కూలు చైర్మన్ కానాల నాగలక్ష్మిదేవి గురువారం తెలిపారు. ఈ పరీక్షలు నంద్యాల కేంద్రంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటాయన్నారు. అభ్యర్థులు పాఠశాల పనివేళల్లో భాగ్యోదయ హైస్కూలులో హాల్ టికెట్లు పొందవచ్చని సూచించారు.

పేరా సేవలు చిరస్మరణీయం

కోవెలకుంట్ల: కోవెలకుంట్లకు చెందిన దివంగత పేరా రామసుబ్బారెడ్డి సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్‌సీపీ యువజన విభాగ నియోజకవర్గ అధ్యక్షుడు డాక్టర్ పేరా శ్రీధర్‌రెడ్డి అన్నారు. పేరా మూడవ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం పేరా బిల్డింగ్స్ ఆవరణలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతగా పేరా అనేక సేవా కార్యక్రమాలు చేసి పేద కుటుంబాలకు అండగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు పోతం రాంమోహన్ రెడ్డి, నాగభూషణంరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీనివాసనాయక్ తదితరులు పాల్గొన్నారు.



పేరా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

భారీ వర్షం...పొంగిన వాగులు, వంకలు



ఫైర్ స్టేషన్ ఆవరణలో నేలకొరిగిన వృక్షం



బాధితులకు ఆర్థిక సాయం అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్



ఉధృతంగా ప్రవహిస్తున్న జెర్రికొండ వాగు

డోన్ : మండలంలో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. డోన్ పట్టణంలోని కొన్ని కాలనీలు జలమయం అయ్యాయి. శ్రీరాం నగర్ , నల్లగుట్ట ప్రాంతాల్లోని ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ , వైఎస్ఆర్‌సీపీ బీసీ విభాగం అధ్యక్షులు పోస్టు ప్రసాద్, కౌన్సిలర్ శరత్ శ్రీ రాం నగర్ నల్లగుట్ట ప్రాంతాల్లో పర్యటించి సహాయక చర్యలు చేపట్టారు. వర్షపు నీటిని పొక్లెయినర్‌తో ఎక్కడికక్కడే తొలగింపు చేయించారు. రెండు గృహాలు పూర్తిగా జలమయం కావడంతో ఆహార ధాన్యాలన్నీ తడిసి పోయినట్లు స్థానికులు మున్సిపల్ చైర్మన్ దృష్టికి తేగా స్పందించిన పోస్టు ప్రసాద్ బాధిత కుటుంబాలకు తక్షణ సాయంగా రూ.12 వేలు అందజేశారు. స్థానిక ఫైర్ స్టేషన్ ఆవరణలోని పెద్ద వృక్షం విద్యుత్ వైర్లపై పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. వెంకటనాయునిపల్లె, మల్లెంపల్లె, జెర్రికొండ వాగులు వర్షం నీటితో ఉధృతంగా ప్రవహించాయి. వెంకటనాయునిపల్లె వద్ద ఈ ఏడాది వేసిన తారురోడ్డు వర్షపునీటి దాటికి పూర్తిగా దెబ్బతినింది. యు కొత్తపల్లె గ్రామం బలిజ పెద్దన్న ఇంటిపై పిడుగు పడటంతో ఆర్‌సీ దెబ్బతింది. డోన్ మండలంలో 109.2 మి.మీ వర్షపాతం, ప్యాపిలి మండలంలో 13.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

బనగానపల్లెలో 22.4 మిమీ వర్షాపాతం

బనగానపల్లె: బనగానపల్లె పరిసరప్రాంతాల్లో బుధవారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు కురిసిన వర్షం 22.4 మీ.మీలుగా నమోదైంది. వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఊపిరి పిల్చుకుంటున్నారు. ఇప్పటికే దాదాపు ఆరువేల హెక్టార్లలో సాగు చేసిన మొక్కజొన్న పంటకు ఎంతో ఉపయోగకరమని రైతులు పేర్కొంటున్నారు. ఖరీఫ్ సాగు నిమిత్తం వరి నారుమళ్లు పోసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

వ్యవసాయ పనుల్లో రైతన్న బిజీ!



.మల్లెంపల్లెలో వేరు శనగ విత్తనాలు వేస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : వరుణుడు కరుణించడంతో ఉక్కపోత నుంచి ఉపశమనం పొందుతున్నారు జనం. మంగళ, బుధవారాలు రాత్రి భారీ వర్షం కురువడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా వర్షం కురువకపోవడంతో నిరాశకు గురైన రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పనుల్లో బిజీ అయ్యారు. డోన్ మండలంలో 25, 250 హెక్టార్ల సాగు భూమి ఉంది. వర్షం కురువడంతో కందులు, ఆముదాలు, పత్తి, వేరుశనగ సాగుకు సిద్ధం అయ్యారు. సబ్సిడీ విత్తనాలు, ఎరువులు రైతు భరోసా కేంద్రాల్లోనే లభిస్తుండటంతో వెంటనే విత్తనాలు విత్తుతున్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ డబ్బులు ఇవ్వాలంటూ దాడి

డోన్ టౌన్ : ఆన్‌లైన్ బెట్టింగ్ డబ్బులు ఇవ్వాలంటూ స్నేహితుడి తండ్రిపై దాడి చేసిన సంఘటన డోన్‌లో చోటు చేసుకుంది. పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన నూర్‌బాషా కుమారుడు రియాజ్ స్థానిక ప్రభుత్వ ఐటీఐ చుదువుతున్నాడు. రియాజ్ సెల్‌ఫోన్లో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్నట్లు తండ్రి గుర్తించారు. కుమారుడు రియాజ్‌తోపాటు ప్రోత్సహిస్తున్న స్నేహితులను మందలించాడు. దీంతో రియాజ్ స్నేహితులు చాంద్, ముస్తఫాతోపాటు మరి కొంత మంది గురువారం నూర్ బాషా ఇంటి దగ్గరికి వచ్చి కుమారుడు రియాజ్ ఆన్‌లైన బెట్టింగ్‌లో బాకీపడిన రూ.30వేల ఇవ్వాలంటూ వాగిద్వాదం చేసి దాడికి పాల్పడ్డారు. నూర్‌భాషా తలకు గాయం కావడంతో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటనపై పట్టణ పోలీసులు విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

డోన్ టౌన్ : మండల పరిధిలోని దేవరబండ గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొనడంతో గోపా ల్, రామాంజనేయులు గాయపడ్డారు. ప్యాపిలి మండలం వెంకటనాయునిపల్లె గ్రామ డీలరుగా విధులు నిర్వహిస్తున్న గోపాల్ డోన్ వైపు బైకుపై వస్తుండగా అదే మండలం ఎనుగుమర్రి గ్రామానికి చెందిన రామాంజనేయులు రాంగ్ రూట్లో వచ్చి ఢీకొట్టినట్లు సమాచారం. గాయపడిన వీరిని 108 వాహనంలో డోన్ ప్రభుత్వ వైద్యశాలలో చేర్చారు. ప్రథమ చికిత్స అనంతరం కర్నూలుకు తరలించారు.

గోపాలనగరంలో పిడుగుపాటు

ప్యాపిలి: మండల పరిధిలోని గోపాలనగరంలో గురువారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ధాటికి ప్రజలు ఆందోళనకు గురయ్యారు. గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి నివాస గృహంపై పిడుగు పడింది. దీంతో గోడపై భాగం పాక్షికంగా దెబ్బతింది.

నకిలీ విత్తనాల అమ్మకాలను అరికట్టాలి

డోన్ టౌన్ : నకిలీ విత్తనాలు, మందులు విక్రయాలను ఆర్బీకే సహాయకులు బాధ్యతగా అరికట్టాలని వ్యవసాయశాఖ జిల్లా అధికారి మోహన్ రావు సూచించారు. స్థానిక ఏడీఏ కార్యాలయంలో గురువారం ఆర్బీకే సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌలు రైతులకు పత్రాలు అందించాలని, పీఎం కిసాన్ ఈకేవైసీ వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. సేకరించిన మట్టి నమూనాలను సాయిల్ టెస్ట్ పూర్తి చేసి హెల్త్ కార్డులో అప్‌లోడ్ చేయాలన్నారు. వర్షాలు ప్రారంభమయ్యాయని, ఆర్బీకే కేంద్రాల్లో సిబ్బంది రైతులకు అందుబాటు ఉంటూ విత్తనాలు, ఎరువులు, మందులు సకాలంలో అందజేయాలని సూచించారు. అనంతరం అంతర్జాతీయ చిరు దాన్యాల సంవత్సర పథకం కింద కొంత మంది రైతులకు కొర్రలు సంచులను అందించారు. కార్యక్రమంలో డోన్ డివిజన్ ఏడీఏ అశోక్‌వర్ధన్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ షఫీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మోహన్ రావు

గృహ నిర్మాణాలకు అడ్వాన్స్ రూ. 20వేలు

డోన్ టౌన్: జగనన్న కాలనీల్లో గృహాలు నిర్మించుకునే లబ్ధిదారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రూ.20వేలు అడ్వాన్సుగా ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ నాగభూషణం తెలిపారు. గురువారం మండలంలోని గోసానిపల్లె గ్రామంలో సర్పంచ్ బాలమ్మ, ఎంపీటీసీ మదన్‌గోపాల్ ఆధ్వర్యంలో వారు లబ్ధిదారులతో సమావేశమయ్యారు. ఇల్లు లేని ప్రతి పేద సొంతింటి కళ నేరవేర్చేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవానలి సూచించారు. ఇసుక, సిమెంట్, ఐరన్‌తో పాటు నిర్మాణ దశ మేరకు బిల్లులను వెంట వెంటనే చెల్లిస్తామన్నారు. ఇప్పటి వరకు ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించని లబ్ధిదారుల వివరాలపై ఆరా తీసిన వారు త్వరితగతిన చేపట్టాలని సూచించారు.



లబ్ధిదారులతో సమావేశమైన అధికారులు

కౌలుదారు పత్రాలు తప్పకుండా తీసుకోవాలి

బేతంచెర్ల: ఖరీఫ్ సీజన్‌లో కౌలుసాగు రైతులు తప్పనిసరిగా భూమి యజమాని నుంచి కౌలు పత్రాలు తీసుకోవాలని ఏఓ కిరణ్ కుమార్ గురువారం తెలిపారు. కౌలు రైతులు కౌలు పత్రాల కోసం సంబంధిత రైతు భరోసా కేంద్రం, గ్రామ రెవెన్యూ అధికారి దగ్గర దరఖాస్తు చేసుకోవాలన్నారు. భూ యజమాని ఆధార్ కార్డు, పట్టదారు పాస్ బుక్ జిరాక్స్, కౌలు దారు ఆధార్ కార్డ్ అందజేయాలన్నారు. కౌలుదారు కార్డు వలన బ్యాంక్‌లో పంట రుణం, పంట నష్ట పరిహారం, పంటల బీమా, సున్నవడ్డీ, మద్దతు ధరకు పంటను కొనుగోలు వంటి ప్రయోజనాలు కౌలు దారుడు పొందవచ్చన్నారు.